క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కనగల్: మండల కేంద్రంలోని కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీ, ఎంపీహెచ్ డబ్ల్యూ కోర్సుల్లో బోధన చేసేందుకు గెస్ట్ లెక్చరర్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని కేజీబీవీ ప్రత్యేక అధికారి బండారి స్వప్న బుధవారం ఒక ప్రకటనలో కోరారు. తెలుగు, ఇంగ్లిష్, సివిక్స్, ఎకనామిక్స్, కామర్స్ నర్సింగ్ ఒకటి, రెండు సబ్జెక్టులకు సంబంధించిన అభ్యర్థులు ఈ నెల 12 నుంచి 14 వరకు కనగల్ కేజీబీవీలో దరఖాస్తులను అందజేయాలని సూచించారు. అదేవిధంగా మొదటి సంవత్సరం సీఈసీ గ్రూపులో 40 సీట్లు, ఎంపీహెచ్ డబ్ల్యూ గ్రూప్ లో 40 సీట్లు ఉన్నట్లు తెలిపారు.

ఆస్పత్రిలో అన్నదానం



అన్నదానం చేస్తున్న కౌన్సిల్ సభ్యులు

నల్లగొండ: నేషనల్ హ్యూమన్ రైట్ కౌన్సిల్ జిల్లా చైర్మన్ చింతమల్ల గోవర్ధన్ కుమారుడు అఖిల్‌కుమార్ జన్మదినం సందర్భంగా బుధవారం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

గుండెపోటుతో బ్యాంకు ఉద్యోగి మృతి

చండూరు: గుండెపోటుకు గురై బ్యాంకు ఉద్యోగి మృతి చెందిన సంఘటన చండూరు మండలంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చండూరు మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన తిరందాసు శివ(28) చౌటుప్పల్ పట్టణంలో పోచంపల్లి కోఆపరేటివ్ బ్యాంకులో 7 సంవత్సరాలుగా పనిచేస్తున్నాడు. బుధవారం యథావిధిగా డ్యూటీకి వెళ్లి బ్యాంకులో పనిచేస్తున్న సమయంలో ఛాతిలో నొప్పి రావడంతో నల్లగొండకు తరలించారు. చికిత్స చేస్తున్న సమయంలో శివ మృతి చెందాడు. మృతుడికి రెండు సంవత్సరాల క్రితం వివాహం కాగా 10 నెలల కొడుకు ఉన్నాడు. మృతుడి సోదరుడు కూడా మీడియా రంగంలో గ్రాఫిక్ డిజైనర్‌గా పనిచేస్తూ చిన్న వయసులోనే గుండెపోటుతో మరణించాడు.

సమాచారం లేకుండా టెండర్లు

నార్కట్‌పల్లి : చెర్వుగట్టు గ్రామ పంచాయతీ పరిధిలో దుకాణాల టెండర్ ఎలాంటి సమాచారం లేకుండా ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. 21 షాపులకుగాను గ్రామ పంచాయతీ అధికారులు ఎవరికీ సమాచారం ఇవ్వకుండా బుధవారం టెండర్‌లు ఏర్పాటు చేశారు. దీంతో అధికారులకు అనుకూలంగా ఉన్నవారికి మాత్రమే టెండర్‌లు దక్కించుకున్నట్లు గ్రామస్తులు ఆరోపించారు. గతంలో టెండర్ ఏర్పాటు చేసే ముందు గ్రామంలో టామ్ టామ్ వేయించడంతో టెండర్‌లో పాల్గొనే వాళ్లమని గ్రామస్తులు తెలిపారు. 21 షాపులకు గాను 14 షాపులకు టెండర్‌లు ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈ విషయమై ఎంపీఓ సుధాకర్‌ను వివరణ కోరగా.. తనకు సంబంధం లేదని వివరించారు.

డిగ్రీ అధ్యాపకుల ప్రచారం

నకిరేకల్ : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం అడ్మిషన్లలో భాగంగా అధ్యాపకులు షాప్ టు షాప్ ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ నెల 13 నుంచి దోస్త్ మూడో విడత అడ్మిషన్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బెల్లి యాదయ్య, వైస్ ప్రిన్సిపాల్ నాగు, అధ్యాపకులు ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాసాచారి. హరిత, మధుసూదన్‌రెడ్డి, శంకర్, సిబ్బంది వెంకన్న, సయ్యద్, సుదర్శన్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

తీరిన ప్రయాణికుల పాట్లు

సాక్షి ఎఫెక్ట్..

మునుగోడు: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో మరుగుదొడ్లు వినియోగించకుండా సిబ్బంది తాళం వేయడంతో కొంతకాలంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో సోమవారం సాక్షి దినపత్రికలో మరుగుదొడ్లు ఉన్నా.. ఉపయోగం సున్నా అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌లో పనిచేసే స్వీపర్లపై ఆగ్రహించి మరుగుదొడ్ల తలుపులు నిత్యం తెరిచి ఉంచాలని, లేదంటే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. దీంతో మరుగుదొడ్ల తాళం తీసి ప్రయాణికులకు అందుబాటులో ఉంచుతున్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షి దినపత్రికకు ప్రయాణికులు ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో చదివి సైంటిస్టు అయ్యాను



నేను నాంపల్లి మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1981–82 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేశా. మా పాఠశాల ఉపాధ్యాయులు భయంతోపాటు చదువు బాగా చెప్పేవారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని సైంటిస్టు అయ్యాను. సికింద్రాబాద్‌లోని తార్నక ప్రాంతంలో ఐఐటీటీ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ)లో పని చేస్తున్నాను. మా గురువులు గొప్పగా చదువు చెప్పారు కాబట్టి నేను ఈ స్థితిలో ఉన్నాను.

– నక్క లింగయ్య, నాంపల్లి

కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాల



మునుగోడు మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల



తరగతి గదిలో ఏర్పాటు చేసిన డెస్క్ బెంచీలు

- దాతల సహకారం, ప్రభుత్వ నిధులతో ప్రాథమిక పాఠశాలకు కొత్తరూపు
- డెస్క్ బెంచీలు, ఫ్యాన్లు ఏర్పాటు
- పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య

మునుగోడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో అందంగా తీర్చిదిద్దారు. 2019వ సంవత్సరం వరకు ఆ పాఠశాల పాడుబడిన బంగ్లాలాగా ఉండేది. కస్తూరి ఫౌండేషన్ సహకారంతో ఆ పాఠశాలకు కొత్తరూపు తీసుకొచ్చారు. తరగతి గదులకు రంగులు వేయడంతోపాటు విద్యార్థుల చదువులకు ఉపయోగపడే బొమ్మలను గీయించారు. అదే విధంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా 2020–21 విద్యా సంవత్సరంలో మునుగోడు ప్రాథమిక పాఠశాలలో కనీస సౌకర్యాలకు రూ.4 లక్షలు, ప్రహరీ ఇతర అభివృద్ధి పనులకు రూ.15 లక్షలు మొత్తం రూ. 19 లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులతో చేపట్టిన పనులతో మునుగోడు ప్రభుత్వ పాథమిక పాఠశాల ఓ రంగుల భవనం లాగా కనిపిస్తోంది.

విద్యార్థులకు కంప్యూటర్ విద్య..

మన ఊరు-మన బడిలో కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో తరగతి గదుల్లో డెస్క్ బెంచీలతోపాటు ఫ్యాన్లు ఏర్పాటుచేశారు. అంతేకాకుండా దాతల సహకారంతో కంప్యూటర్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ సైతం ఇస్తున్నారు. దీంతో గతంలో కేవలం 65 మంది విద్యార్థుల సంఖ్య మాత్రమే ఉన్న ఈ పాఠశాలలో ప్రస్తుతం 132 మందికి చేరుకుంది. ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య 150 మందికిపైగా చేరే అవకాశం ఉందని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు చెబుతున్నారు.



పాఠశాల ఆవరణలో నిర్మించిన మంచి నీటి ట్యాంకులు

కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం



మాట్లాడుతున్న కొండేటి మల్లయ్య

నల్లగొండ: కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం అమలవుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన కొండేటి మల్లయ్య అన్నారు. బుధవారం నల్లగొండలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీలు, మంత్రి వర్గ విస్తరణ, పీసీసీ కమిటీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 67 శాతం పదవులు అప్పగించిందంటే కాంగ్రెస్ పార్టీలో సామాజిక న్యాయం ఏవిధంగా అమలవుతుందనేది గమనించాల్సిన అవసరం ఉందన్నారు. తాను 25 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీలో నిబద్ధత కలిగిన కార్యకర్తగా పని చేసినందునే పీసీసీ ఉపాధ్యక్ష పదవిని అప్పగించారని చెప్పారు. అందుకు పీసీసీ అధ్యక్షుడికి, సీఎంకు, జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితోపాటు తన గురువు జానారెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు వెంకటనర్సయ్య, గార్లపాటి చంద్రశేఖర్, కోట పుల్లయ్య, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు మల్లయ్యను గజమాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

వైఫల్యాలను అధిగమిస్తేనే విజయం సాధిస్తాం



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య

నల్లగొండ టౌన్: వైఫల్యాలను అధిగమిస్తేనే విజయం సాధిస్తామని నల్లగొండ ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య అన్నారు. బుధవారం నల్లగొండలోని ఎంవీయన్ విజ్ఞాన కేంద్రంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ మన దేశ విద్యార్థులు విదేశీ విద్యార్థుల కంటే గ్రామర్, అక్షర దోషాలు రాకుండా ఉండడంలో ముందుంటున్నారన్నారు. పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే విద్యార్థులకు ఆంగ్ల భాషలో కమ్యూనికేషన్ స్కిల్స్ ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ అక్కెనపల్లి మీనయ్య, పి.నర్సిరెడ్డి, పి.యాదగిరి, పి.శంకర్ పాల్గొన్నారు.

భూ భారతితో రెవెన్యూ సమస్యలు పరిష్కారం



పానగల్‌లో మాట్లాడుతున్న ఆర్డీఓ అశోక్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): భూ భారతితో రెవెన్యూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆర్డీఓ అశోక్ రెడ్డి అన్నారు. పానగల్లులో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఎండీ. గౌస్ తదితరులు పాల్గొన్నారు.

భూ భారతితో సత్వర పరిష్కారం

చిట్యాల: భూ భారతి చట్టంతో రైతుల భూ సమస్యలు సత్వరమే పరిష్కారమవుతాయని చిట్యాల తహసీల్దార్ జి.కృష్ణనాయక్ అన్నారు. చిట్యాల మండలంలోని పిట్టంపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పిట్టంపల్లి, శివనేనిగూడెం గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో వివిధ రకాల భూ సమస్యలపై 60 దరఖాస్తులను రైతుల నుంచి రెవెన్యూ అధికారులు స్వీకరించారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ తహసీల్దార్ విజయ, ఆర్‌ఐలు అమర్‌నాథ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, పీఏసీఎస్ సీఈఓ బొంతల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూర్ : మండలంలోని పరడ, కట్టంగూర్ గ్రామాల్లో బుధవారం అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పరడ గ్రామంలో 74, కట్టంగూర్‌లో 71 దరఖాస్తులు స్వీకరించినట్లు డిప్యూటీ తహసీల్దార్ ఫ్రాంక్లిన్ ఆల్‌బర్ట్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఎస్ కుమార్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

మర్రిగూడ: భూ భారతి చట్టం అమలులో భాగంగా మర్రిగూడ మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు బుధవారంతో ముగిశాయని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు తెలిపారు. మండల వ్యాప్తంగా రైతుల నుంచి మొత్తం 1158 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కాగా బుధవారం మర్రిగూడలో 56, వెంకేపల్లి గ్రామంలో 9 దరఖాస్తులు రైతుల నుంచి వచ్చాయి. కార్యక్రమంలో డీటీ చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనునాయక్, ఆర్‌ఐలు పాండురంగారెడ్డి, జహీరొద్దిన్, సిబ్బంది పాల్గొన్నారు.

కేతేపలి: భూ భారతి చట్టం అమలులో భాగంగా ఈ నెల 3వ తేదీ నుంచి కేతేపల్లి మండలంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు బుధవారం ముగిశాయి. చివరగా బుధవారం కేతేపల్లిలో అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ భూ సమస్యలకు సంబంధించి రైతుల నుంచి 137 దరఖాస్తులు స్వీకరించామని తహసీల్దారు ఎంఏ.సత్తార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు వెంకన్న, రామచంద్రయ్య, సర్వేయర్ టి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం

కనగల్: అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని కనగల్ ఎంపీడీఓ టీ.జయరాం, ఆర్టీఏ సభ్యుడు కుసుకుంట్ల రాజిరెడ్డి అన్నారు. బుధవారం కనగల్ మండల పరిధిలో రామచంద్రపురం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను వారు లబ్ధిదారులకు అందజేసిన మాట్లాడారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకుడు ఏమిరెడ్డి దిలీప్‌రెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం

గట్టుప్పల్ : మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు అధికారులు బుధవారం శ్రీకారం చుట్టారు. గట్టుప్పల్‌లో 43 ఇళ్లు మంజూరు కాగా లబ్ధిదారులకు ముందుగా మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కల్పించారు. అనంతరం అధికారులు ముగ్గులు పోసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వరుణ్, పంచాయతీ కార్యదర్శి ఎండీ.షఫీ పాల్గొన్నారు.

శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి ఆలయంలో హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని శ్రీ వారిజాల వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం అర్చకుడు కారంపూడి సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో వేద మంత్రాలతో హోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలకు ఆలయ చైర్మన్ దోసపాటి ప్రసాద్ సన్మానించారు. వేడుకల్లో సామ కొండల్ రెడ్డి, ఐతరాజు రమేష్, దుబ్బాక యాదిరెడ్డి, నడింపల్లి అంజమ్మ, జేరిపోతుల భారత్, కొప్పు నర్సింహ, గంధం భాస్కర్, పసునూరి శ్రీనివాస్, ఇరుకుల భిక్షపతి, గుడూరు అంజిరెడ్డి, బిళ్ళకంటి శ్రీకాంత్, దోసపాటి రఘు, పాశం పూలమ్మ, కొప్పు భాగ్యమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



నార్కట్‌పల్లి : అమ్మ మాట-అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి



కట్టంగూర్ : చెరువు అన్నారంలో విద్యార్థులతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారదాదేవి

నార్కట్‌పల్లి : మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని, ప్రైవేటు పాఠశాలకు పిల్లలను పంపించకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. బుధవారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలో అమ్మ మాట- అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలు, ప్రీస్కూల్ పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ సెంటర్‌లోనే భోజనం చేయాలన్నారు. ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో వారంలో రెండు రోజులు ప్రీ స్కూల్ పిల్లలకు ఎగ్ బిర్యానీ అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ కృష్ణవేణి, సీడీపీఓ ఆగఅగ్రఅంజుమ్, ఎంపీఓ సుధాకర్, సూపర్‌వైజర్‌లు సరిత, అంజమ్మ, ఏఎన్‌ఎం నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

చిట్యాల: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు, చిన్నారులకు, కిశోర బాలికలకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని చిట్యాల మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రావణ్‌కుమార్ అన్నారు. చిట్యాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో బుధవారం ఆయన మాట్లాడారు. అదేవిధంగా మండలంలోని చిన్నకాపర్తి అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో అమ్మమాట-అంగన్‌వాడి బాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ జయలక్ష్మి, ఎంఈఓ సైదానాయక్, ఏసీడీపీఓ వెంకటమ్మ, సూపర్‌వైజర్ సునిత, అంగన్‌వాడీ టీచర్‌లు అరుణ, అపర్ణ, బుజ్జమ్మ, మమత, జ్యోతి, శోభారాణి, కృష్ణవేణి పాల్గొన్నారు.

నకిరేకల్ : మండలంలోని ఓగోడు గ్రామంలో బుధవారం అంగన్‌వాడీ బడి బాట నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని పాల్గొని మాట్లాడుతూ చిన్నారులను అంగన్‌వాడీ బడికి పంపాలని కోరారు. అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మునుగోడు: అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ లావణ్య కోరారు. బుధవారం మునుగోడులో నిర్వహించిన అమ్మ పాట- అండన్‌వాడీ బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోందన్నారు. అదేవిధంగా మండలంలోని వివిధ గ్రామాల్లో అమ్మ పాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీలు నిర్వహించారు.

అంగన్‌వాడీలో ప్రీ స్కూలు విద్య

చండూరు: అంగన్‌వాడీల్లో ప్రీస్కూలు విద్య, పౌష్టికాహారం అందిస్తున్నట్లు గుండ్రపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్ అన్నారు. బుధవారం గుండ్రపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన అమ్మ మాట-అంగన్‌వాడీ బాట ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రఘునమ్మ, అంగన్‌వాడీ టీచర్లు శిరీష, పుష్పవేణి, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మర్రిగూడ మండల కేంద్రంలో బుధవారం అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి సీడీపీఓ సక్కుబాయి పాల్గొని మాట్లాడుతూ 3 నుంచి 5 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ బిట్టు శ్రీనివాస్, డీటీ కె.చంద్రశేఖర్, ఏపీఎం వెంకట్, ఆర్‌ఐ పాండురంగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి యూసుఫ్, సూపర్‌వైజర్‌లు యశోద, శ్రీలత, అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, విమలాదేవి, లక్ష్మి పాల్గొన్నారు.

చెర్వుఅన్నారంలో

కట్టంగూర్ : మండలంలోని చెర్వుఅన్నారం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారదాదేవి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఆ గ్రామ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జి భీమయ్య, వైద్యాధికారి శ్వేత, పంచాయతీ కార్యదర్శి ఉపేందర్, ఏఎన్‌ఎం సోమలక్ష్మి, ఆశావర్కర్ సంధ్యారాణి, అనిత, లలిత, అరుణ, సైదమ్మ, ముత్తమ్మ పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన



మర్రిగూడ : రాంరెడ్డిపల్లిలో పొలం వద్ద బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కేతేపల్లి: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన సాగుతోందని కేతేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం యానాల నర్సిరెడ్డి అన్నారు. కేతేపల్లి మండల కేంద్రంలో జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి బుధవారం బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలకు పిల్లలను పంపించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్ రెడ్డి, శ్రీలత, అమరేందర్, వెంకటేషం, యాదగిరి, సత్యనారాయణ, ఇందిరమ్మ, సహాయమేరి, హరిత లక్ష్మి, యాదమ్మ, భాగ్యలక్ష్మి, సీఆర్పీ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వినూత్న రీతిలో బడిబాట

మర్రిగూడ: ఏరువాక పౌర్ణమి సందర్భంగా రైతులు తమ పొలాల వద్ద వ్యవసాయ పనుల్లో నిమగ్నమవడంతో బుధవారం మండలంలోని రాంరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు అక్కడికి వెళ్లి వినూత్న రీతిలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. హెచ్‌ఎం బాడిగ అంజయ్య, ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వీరేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఎన్నికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఆ సంఘం స్టేట్ జనరల్ బాడీ సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం సమావేశానికి ఎమ్మెల్యే వీరేశం హాజరయ్యారు.

పాఠశాలకు వెళ్లేందుకు సిద్ధం..

పాఠశాలలు గురువారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో నల్లగొండ పట్టణంలోని దుకాణాల్లో విద్యార్థుల సందడి నెలకొంది. స్కూల్ యూనిఫాం, షూ, నోట్ బుక్స్, బ్యాగులు కొనుగోలు చేసేందుకు విద్యార్థులు రావడంతో దుకాణాలు రద్దీగా మారాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నల్లగొండ



షూ కొనుగోలు చేస్తున్న విద్యార్థులు



యూనిఫాం కొనుగోలు చేస్తున్న విద్యార్థులు



స్కూల్ బ్యాగ్ కొనుగోలు చేస్తున్న విద్యార్థులు

విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి

నార్కట్‌పల్లి : ఎరువుల దుకాణాల డీలర్లు రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి మాట్లాడారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా బిల్ తీసుకుని పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరచుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏఓ గౌతమ్ ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన

చండూరు : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వలేదని నిరసిస్తూ దోనిపాముల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు పాండు, చండూరుకు చెందిన ఖలీల్ చండూరు పట్టణంలో వాటర్ ట్యాంకు ఎక్కి నిరసన తెలిపారు. భువనగిరి ఎంపీ సీటు గెలిపిస్తే రాజగోపాల్‌రెడ్డిని మంత్రిని చేస్తానని సీఎం మాటిచ్చి ఆయనే మాట తప్పారని అన్నారు.

చర్చి నిర్మాణం నిలిపివేయాలని వినతి

చిట్యాల: మండలంలోని ఏపూరు గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా చేపడుతున్న చర్చి నిర్మాణ పనులను నిలిపివేయాలని కోరుతూ బుధవారం ఆ గ్రామస్తులు గ్రామపంచాయతీ కార్యదర్శి మల్లేష్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు బాతరాజు సాయికుమార్, అంతటి నరేష్‌గౌడ్, గోలి విష్ణు, తాటి బాలకృష్ణ, పాలెం అంజయ్య, బొడ్డు గణేశ్, పాండు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్ నుంచి వివేరా హోటల్ వరకు రోడ్డుకు ఇరువైపులా లూజ్ పోల్స్ మరమ్మతు పనులు చేస్తుండడంతో గురువారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రావు తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సహకరించాలని కోరారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

మర్రిగూడ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన పాఠ్య పుస్తకాల పంపిణీని బుధవారం ఎంఈఓ బిట్టు శ్రీనివాస్ ప్రారంభించారు. మండలంలోని 18 ప్రాథమిక, 6 ప్రాథమికోన్నత, 7 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు సంబంధించిన పాఠ్య పుస్తకాలను గురువారం వరకు పంపిణీ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు చంద్రయ్య, కృష్ణనాయక్, బిచ్చానాయక్, సిబ్బంది రహీం తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం పనుల పరిశీలన

మర్రిగూడ: మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన భవిత కేంద్రంలోని మరుగుదొడ్ల నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంఈఓ బిట్టు శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఏఈ ధనలక్ష్మితో కలిసి పనుల పురోగతిని తెలుసుకున్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు.

బస్సులు ఆపాలని వినతి

నల్లగొండ టూటౌన్: నల్లగొండ సమీపంలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వద్ద బస్సులు ఆపాలని, రిక్వెస్టు బస్టాప్ ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం ఏబీవీపీ ఎంజీయూ ఆధ్వర్యంలో నల్లగొండలో ఆర్టీసీ డీఎంకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు హనుమాన్, మోహన్, ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఛత్రపతి, యూనివర్సిటీస్ కో కన్వీనర్ మానేష్, సంపత్, ప్రవీణ్,శివ పాల్గొన్నారు.

మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

మర్రిగూడ: తనపై అక్రమ కేసులు పెట్టారని మర్రిగూడ మండలంలోని శివన్నగూడ గ్రామానికి చెందిన బేరె రాములు బుధవారం హైదరాబాద్‌లో మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను 13 సంవత్సరాల క్రితం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నుంచి ఇల్లు కొనుగోలు చేయగా ఆ వ్యక్తి తనపై దాడికి పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు చేయాలి

కట్టంగూర్ : ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను ప్రభుత్వం పటిష్టంగా అమలు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున అన్నారు. ఈ నెల 22, 23 తేదీల్లో కట్టంగూర్‌లో నిర్వహించనున్న కేవీపీఎస్ జిల్లా శిక్షణ తరగతుల కరపత్రాలను కేవీపీఎస్ మండల నాయకులతో కలిసి బుధవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్లలో ప్రకటించిన డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, పెంజర్ల సైదులు, గాదె నర్సింహ, ఒంటిపాక కృష్ణ, బొల్లు రవీందర్, దండు రవి, వంగూరి వెంకన్న, ఉదోటి నరహరి, పెరిక మల్లయ్య ఉన్నారు.

బస్సులను సీజ్ చేయాలని వినతి

నల్లగొండ: ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలని కోరుతూ బుధవారం ఆర్టీవోకు ఏబీవీపీ నగర ఉపాధ్యక్షుడు నల్లగంతుల శివ వినతిపత్రం అందజేశారు. నల్లగొండలోని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు ఫిట్‌నెస్ లేని బస్సులు నడుపుతున్నారని తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఛత్రపతి, ఆవుల సంపత్, దాసోజు ప్రవీణ్, మధులు ఉన్నారు.